ఆముదం.. అదృశ్యం

- ఎక్కడా కానరాని పంట సాగు
- ఆసక్తి చూపని అన్నదాత
- దీపాలు వెలిగించేందుకు వినియోగం
- ఆదివాసీలకు ఎంతో శ్రేష్ఠం



ఆముదం విత్తనాలు



ముర్కిలొంకలో రైతు పొలంలోని ఆముదం మొక్క

కెరమెరి: పూర్వం ప్రకృతి వైద్యంలో కీలకమైన ఆముదం నేటి వ్యవసాయ సాగులో మచ్చుకైనా కనిపించడం లేదు. ఈ పంట సాగుకు రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. గతంలో పుట్టిన పిల్లల నుంచి వయో వృద్ధుల వరకు ఆముదం నూనె తలకు రాసుకునే వారు. దీంతో చల్లదనంతో పాటు ఆరోగ్యం లభించేది. ఆముదంతో మలబద్ధకం తొలగిపోవడంతో పాటు జీర్ణప్రకియ సజావుగా సాగేది. ప్రస్తుతం మండలంలో అనేక మంది రైతులు పత్తి, కంది, పెసర, జొన్న, మొక్కజొన్న తదితర పంటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. కానీ మండలంలో ఎక్కడా ఆముదం సాగు చేయడం లేదు.

గతంలో ఆముదానికే ప్రాధాన్యం

మండలంలోని అనేక కుటుంబాలు గిరిజనులకు చెందినవి కావడంతో గతంలో అనేక మంది ఆముదం అంతర పంటగా వేసేవారు. అప్పుడు అన్ని రకాల నూనెల కంటే ఆముదం నూనెకు ధర ఎక్కువగా ఉండేది. మండలంలోని జోడేఘాట్ పరిసర ప్రాంతాలతో పాటు పార్డ, ముర్కిలొంక, పాట్నాపూర్, పాటాగూడ, లైన్‌పటార్, కల్లెగాం తదితర గ్రామాల సమీపంలోని పొలాల్లో అక్కడక్కడా ఆముదం మొక్కలు దర్శనమిస్తున్నాయి. 5 నుంచి 8 అడుగుల వరకు ఆముదం చెట్లు ఏపుగా పెరిగాయి. ఇప్పటికీ ఆదివాసీలు దేవతల పూజలకు ఆముదం నూనె వినియోగిస్తున్నారు. మండలంలోని మహారాజ్‌గూడ అడవుల్లో కొలువైన జంగుబాయి, ఇందాపూర్ సమీపంలోని పోతురాజు, ధర్మరాజుతో పాటు పెద్ద దేవుళ్లకు, పోచమ్మ తల్లికి పెట్టే దీపంలో ఆముదం నూనె వాడుతున్నారు. మండలంలో మొత్తం 6400 మంది రైతులు, 32వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. అందులో 24వేల ఎకరాల్లో పత్తి పంట ఉంది. అందులో ఈసారి పత్తి పంట మొలకెత్తని చోట అక్కడక్కడా ఆముదం విత్తనాలు వేశారు. మొత్తంగా ఐదు ఎకరాలకు మించి ఆముదం మొక్కలు లేవు.

ఆరోగ్యానికి ఎంతో మేలు



నా చిన్నతనంలో ప్రతీరోజు ఆరోగ్య సమస్యకు ఆముదాన్ని ఆయుర్వేదంగా వాడేవారు. నేడు కాస్మొటిక్స్ రావడంతో ఆముదం వాడకం మానేశారు. శరీర సౌందర్యానికి, జీర్ణప్రక్రియకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. కానీ ఈ పంట సాగును రైతులు మరిచిపోతున్నారు.

– మడావి రఘునాథ్, రైతు, మెట్టపిప్రి

మార్కెట్‌లో ధరలు కూడా లేవు..



గతంలో ఆదివాసీలు సంప్రదాయ పంటగా ఆముదం సాగు చేసేవారు. ప్రస్తుతం ఆముదం మొక్కలు అక్కడక్కడ మాత్రమే దర్శనమిస్తున్నాయి. అందుకు వాటిని లెక్కలోకి తీసుకోవడం లేదు. మార్కెట్‌లో అమ్ముదామనుకున్నా అనుకున్న ధర లేదు.

– ఎస్. గోపికాంత్, ఏవో, కెరమెరి

వైభవంగా పునఃప్రతిష్ఠ మహోత్సవం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప దంపతులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సర్‌సిల్క్‌కాలనీలో గల శ్రీరామ మందిర పునఃప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు సోమవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ నిర్మాణం జరిగి 72 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఈ ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా విగ్రహాల పునఃప్రతిష్ఠ, 43 అడుగుల ఏకశిలా ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన, హోమ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే హరీశ్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దంపతులు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ పాల్గొని పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం కబ్జా కాకుండా చూడాలి

బెజ్జూర్: కబ్జాకు గురైన శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలని మండలంలోని ముంజంపల్లి గ్రామస్తులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రామేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో కొంతమంది శ్మశాన వాటిక స్థలాన్ని కబ్జా చేశారని, దీంతో ఎవరైనా మృతి చెందినప్పుడు దహన సంస్కారాల కోసం ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. శ్మశాన వాటిక స్థలం కబ్జాకు గురికాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

బైక్‌పై నుంచి పడి ఒకరికి గాయాలు

ఆసిఫాబాద్‌రూరల్: బైక్ అదుపుతప్పి కింద పడిన యువకుడికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సోమవారం మండలంలోని బూర్గుడ గ్రామానికి చెందిన కొట్ల కిరణ్ బూర్గుడ నుంచి ఆసిఫాబాద్‌కు బైక్‌పై వెళ్తున్న సమయంలో బూర్గుడలోని బీఈడీ కళాశాల సమీపంలో అదుపు తప్పి కింద పడిపోయాడు. దీంతో కాళ్లకు, చేతులకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వైద్యులు మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలి



ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న సీఐ సాదిక్‌పాషా, పోలీసులు

కౌటాల: ప్రజలు నిర్భయంగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని కౌటాల సీఐ సాదిక్‌పాషా అన్నారు. సోమవారం మండలంలోని ముత్తంపేట్ గ్రామంలో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు వేయాలని పేర్కొన్నారు. ఎంపీ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని ప్రజలు ఈమేరకు నడుచుకోవాలన్నారు. అలాగే గ్రామంలో ముగ్గురు బెల్ట్‌షాపు నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన బీఎస్పీ నాయకులు

చింతలమానెపల్లి: ఎమ్మెల్సీ దండె విఠల్ ఆధ్వర్యంలో సోమవారం మండలానికి చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. మండలంలోని కర్జెల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి డోకె రాజన్న, బీఎస్పీ మండల అధ్యక్షుడు గోమాసె లాహంచు, ప్రచార కమిటీ అధ్యక్షుడు రామగోని నీలాగౌడ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్సీ విఠల్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపు కోసం కలిసి పనిచేయాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ఉమామహేశ్, రాజాప్రతాప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

బీఎస్పీ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిక

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన పలువురు బీఎస్పీ నాయకులు సోమవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఎస్పీ నాయకులు అన్వర్ హుస్సేన్, అబ్దుల్, నాందేవ్, రత్నం శ్రీకాంత్, వాజిద్, ఆరిఫ్, విశాల్, కుశాల్, పర్వేజ్ అహ్మద్ తదితరులు పార్టీలో చేరారు.

‘శోభాయాత్ర విజయవంతం చేయాలి’

కాగజ్‌నగర్‌రూరల్: ఈనెల 23న హనుమాన్ జయంతి పురస్కరించుకొని భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన వీర హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని భజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ శివగౌడ్ కోరారు. సోమవారం రాత్రి పట్టణంలోని రాజస్థాన్ భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ పాటిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. సమావేశంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కరీంనగర్ విభాగ్ సేవా ప్రముఖ రంగస్వామి, విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడు హనుమంతరావు, హిందూ ఉత్సవ సమితి ఆర్గనైజర్ లెక్కల మురళీ, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణ, శ్రీరాధాకృష్ణ గోశాల నిర్వాహకుడు విజయ్, బాలకృష్ణ, హితేశ్ అగర్వాల్, సంతోష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భజరంగ్ దళ్ జిల్లా కన్వీనర్ శివగౌడ్

మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

తలమడుగు: ఆదివాసీ గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆదివాసీ మహిళా సంఘాలసభ్యులు, తుడుందెబ్బ నాయకులు హెచ్చరించారు. సోమవారం మండలంలోని ఝరిపూన గూడ గ్రామంలో మాట్లాడారు. కొంత మంది మద్యం వ్యాపారులు రాజకీయ నాయకుల అండదండలతో అమాయక ఆదివాసీలు నివసించే గిరిజన గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ మద్యం, కల్తీకల్లును, విక్రయించి గిరిజనుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి గిరిజన గ్రామాల్లో మద్యం విక్రయాలు జరగకుండా చూడాలని కోరారు. లేనిపక్షంలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు కుమ్ర జ్ఞానేశ్వర్, సిడం మంజుల, కుమ్ర అప్పుబాయి, కుమ్ర, సావిత్రిబాయి గెడం కల్పన, కుమ్ర కౌసల్య, కినాక రంజన, కుమ్రా ప్రేమలాబాయి, కోవా మారుబాయి, కుమ్రా అనసూయ పాల్గొన్నారు.

‘హామీలు నెరవేర్చడంలో విఫలం’

ఆదిలాబాద్‌టౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన చేరికల కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురికి బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. గతంలోనూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను పలుమార్లు ఆ పార్టీ నాయకులు అవమానించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ రాత్ మనోహర్, గంభీర్ ఠాక్రే, ప్రమోద్ రెడ్డి, సతీష్ పవార్, విపిన్, దేవన్న, తన్వీర్, దత్తు మధుకర్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న పుచ్చకాయ ధర



పుచ్చకాయలు విక్రయిస్తున్న వ్యాపారి

- పేదలు కొనలేని పరిస్థితి
- ఉత్పత్తి లేక అధిక రేట్లు
- బెంబేలెత్తుతున్న జిల్లావాసులు
- జిల్లాలో 124 ఎకరాల్లో సాగు

కౌటాల: జిల్లాలో రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతోంది. ఎండాకాలంలో పుచ్చకాయలు తింటే ఆరోగ్యమని తెలిసినా పెరిగిన ధరలతో వాటిని కొనలేని పరిస్థితులు నెలకొన్నాయి. పిల్లల నుంచి పెద్దల వరకు ఇష్టంగా తినే పుచ్చకాయ ధర పైపైకి పోతోంది. గతేడాది కిలో రూ.20గా ఉన్న ధర ప్రస్తుతం రూ. 30కి ఎగబాకింది. జిల్లాలో పుచ్చకాయల పంటను ఈ ఏడాది కేవలం 124 ఎకరాల్లో సాగు చేశారు. కాగజ్‌నగర్ డివిజన్‌లోని మోసం, సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి మండలాల్లోని గ్రామాల్లో 110 ఎకరాల్లో, ఆసిఫాబాద్ డివిజన్‌లోని కెరమెరి, రెబ్బెన మండలాల్లో కేవలం 14 ఎకరాల్లో మాత్రమే పుచ్చకాయల పంటల సాగు చేపట్టారు. జిల్లాలోని ఆరెగూడ, ఈజ్‌గాం, నజ్రుల్ నగర్, సిర్పూర్(టి), వెంపల్లి, రెబ్బెన, గురుడుపేట, డబ్బా, బాబాసాగర్ గ్రామాల్లో రైతులు పుచ్చకాయలు సాగు చేస్తున్నారు.

ఆరోగ్యాన్నిచ్చే కాయ..

రుచిగా, తియ్యగా ఉండే పుచ్చకాయల్లో ఎన్నో పోషక విలువలున్నాయి. ఎండలు ముదురుతున్న ఈ తరుణంలో పుచ్చకాయలు రుచి చూడడానికి అందరూ ఇష్టపడతారు. ప్రస్తుతం జిల్లాలో వీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. జిల్లాలో ఒక్కో పుచ్చకాయ ధర కనిష్ఠంగా రూ. 40 నుంచి గరిష్ఠంగా రూ.120 వరకు పలుకుతోంది. కాయ సైజును బట్టి వ్యాపారులు ధర చెబుతున్నారు. వేసవిలో పండించే పుచ్చకాయలకు బాగా డిమాండ్ ఉండడంతో సహజంగానే వ్యాపారులు ధర పెంచి క్రయవిక్రయాలు చేస్తున్నారు. ఎండతీవ్రత పెరిగే కొద్ది పుచ్చకాయల ధరలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో ఆశించిన స్థాయిలో రైతులు పంట సాగు చేయకపోవడంతోనే జిల్లాలో పుచ్చకాయల ధరలు మండిపోతున్నాయి. దీంతో వీటిని పేదలు కొనుగోలు చేయలేని పరిస్థితులు ఏర్పడ్డాయి.

సాగుపై ఆసక్తి చూపని రైతులు

గతంలో జిల్లాలో వందల ఎకరాల్లో పుచ్చకాయ పంట సాగు చేసేవారు. పుచ్చకాయ పంట సాగుపై రైతులకు అవగాహన లేకపోవడంతో పాటు సాగునీటి వసతి సౌకర్యం లేక పంట సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. ఈ ఏడాది రైతులు జిల్లావ్యాప్తంగా కేవలం 124ఎకరాల్లో మాత్రమే పుచ్చకాయ పంట సాగు చేశారు. ఏటా పుచ్చకాయ పంట సాగు విస్తీర్ణం తగ్గుతుందని, పంటకు సాగునీరు అందక, సరైన ఉత్పత్తి లేక పుచ్చకాయ ధర పెరిగిందని రైతులు చెబుతున్నారు. పుచ్చకాయల ధరలు తగ్గించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

కొనలేని పరిస్థితి ఉంది

మార్కెట్‌లో పుచ్చకాయ ధర చూస్తే కొనలేని పరిస్థితులు ఉన్నాయి. సాధారణ సైజు పుచ్చకాయ ధర కూడా పేదలకు అందుబాటులో ఉండటం లేదు. జిల్లా రైతులు పుచ్చకాయ పంటను అధికంగా సాగు చేయడం లేదు. అందుకే ధర పెరిగింది. అధికారులు పుచ్చకాయల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి. పుచ్చకాయల ధరలను నియంత్రించాలి.

– సాయి, ముత్తంపేట

ధరలు బాగా పెరిగాయి

పుచ్చకాయల ధరలు అమాంతంగా పెరిగాయి. ఒక ట్రాక్టర్ పుచ్చకాయలను రూ.10 వేలు పెట్టి కొనుగోలు చేస్తున్నాం. దీంతో ఒక్కో కాయను రూ. 40 నుంచి రూ. 100 వరకు విక్రయిస్తున్నాం. పుచ్చకాయల ధరలు అధికంగా ఉండడంతో ప్రజలు కొనలేక పోతున్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– గంగారం, పండ్ల వ్యాపారి, కౌటాల

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఇంద్రవెల్లి: జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్‌యార్డు కార్యదర్శి రాజేశ్వర్, వ్యవసాయాధికారి రాథోడ్ గణేష్‌లు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో పీఏసీఎస్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే పంటను అమ్మి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో ధరంసింగ్, ఏఈవో వీరా, సిబ్బంది తుమ్మల సునీల్, లక్ష్మణ్, సురేశ్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణకు ప్రత్యేక కృషి

ఇచ్చోడ: అగ్ని ప్రమాదాల నుంచి ప్రజలను రక్షించేందుకు అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రత్యేక కృషి చేస్తుందని అగ్నిమాపక శాఖ అధికారి రామారావు అన్నారు. జాతీయ అగ్నిమాపక దినోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో సిరిచెల్మ చౌరస్తాలో అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. 1944 ఏప్రిల్ 14న ముంబై నగరంలో జరిగిన అగ్ని ప్రమాదంలో 66 మంది అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. వారి స్మారకార్థం ప్రతీ సంవత్సరం అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అగ్నిమాపక సిబ్బంది సయ్యద్ జావిద్ అలీ, అమీర్, విజయ్, చిన్నబాపు, పాల్గొన్నారు.

పీఆర్టీయూ కార్యవర్గం ఎన్నిక

నార్నూర్: పీఆర్టీయూ మండల కమిటీని సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకోనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఆడే నూరుసింగ్ తెలిపారు. మండల గౌరవ అధ్యక్షుడిగా పవార్ అనిత, మండల అధ్యక్షుడిగా రాథోడ్ రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా కోరెంగ లక్ష్మణ్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడిగా జాదవ్ దిగంబర్, మహిళా అధ్యక్షురాలుగా హీరాబాయి, మండల కార్యదర్శిగా రాథోడ్ ప్రమోద్, తదితరులను ఎన్నుకున్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

జైనూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండలంలోని జంగాం, రాంజీగూడ, ఆసిమెట్ట ప్రభుత్వ పాఠశాలల్లో పనులను సోమవారం పరిశీలించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అన్ని స్కూళ్లలో వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు సకాలంలో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో ప్రభుదయ, ఏఈ ఇందల్, పంచాయతీ కార్యదర్శి మధుకర్ తదితరులు ఉన్నారు.



పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



సీఎంతో ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో జిల్లాకు చెందిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బొమ్మెన ధర్మయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. మాదిగలకు రావాల్సిన ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు పోచన్న తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ సేవలు చిరస్మరణీయం

కాగజ్‌నగర్‌రూరల్: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజు అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటరానితనం రూపుమాపడానికి అంబేద్కర్ తెగువ చూపారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారి తూడూరు దత్తాత్రేయ, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వాంకిడి: ఆసిఫాబాద్ మండలంలోని జన్కాపూర్ రైతు వేదికలో నేడు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో మిలింద్ కుమార్ తెలిపారు. జన్కాపూర్ రైతువేదికలో ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు సేంద్రియ కర్షనం, వరి నాణ్యత ప్రమాణాలు వంటి విషయాలపై శాస్త్రవేత్తలు, ఆదర్శ రైతులతో నేరుగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల రైతులు సకాలంలో హాజరై శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రెబ్బెన: రెబ్బెన సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ఇమ్రాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని గోలేటి, బీమినిగూడ, కైరిగూడ గ్రామాలకు, నంబాల సబ్‌స్టేషన్ పరిధిలోని చిలుకమర్రిగూడ, రాజారాం, నారాయణపూర్, కొమురవెల్లి, కిష్టాపూర్, జక్కులపెల్లి, పైకాజీగూడ గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి 11 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

‘అంబేద్కర్‌ను విస్మరించిన కాంగ్రెస్’

కెరమెరి: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వం పూలమాల వేయకపోవడం శోచనీయమని బీఆర్‌ఎస్ మండల ఎస్సీ సెల్ నాయకుడు కంబాల వినేశ్ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. అధికార ప్రభుత్వం మహనీయుడిని విస్మరించడం తగదన్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపితే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న సీఐ అంజయ్య

ఆసిఫాబాద్‌అర్బన్: నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని జైనూర్ సీఐ అంజయ్య తెలిపారు. సోమవారం మండలంలోని పలు కాలనీల్లో సీఐ ఆధ్వర్యంలో నాకా బందీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహనాలను తనిఖీలు నిర్వహించి సరైన పత్రాలు లేని 25 ద్విచక్రవాహనాలకు చలాన్‌లు విధించారు. అనుమతులు లేని వాహనాలను నడిపితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎడ్ల కొట్టం దగ్ధం

తిర్యాణి: ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించడంతో ఎడ్ల కొట్టం దగ్ధమైన సంఘటన మండలంలోని కొటగాం పంచాయతీ పరిధి ఎర్రబండ గ్రామంలో చోటు చేసుకుంది. గోడం నాగుబాయికి చెందిన ఎడ్ల కొట్టంలో సోమవారం సాయంత్రం మంటలు అంటుకోవడంతో అందులోని ఎడ్ల బండితో పాటు ధాన్యం, ఇతర వస్తువులు దగ్ధమైనట్లు బాధితులు తెలిపారు.